ఆయన కళ్లు మెరిశాయి. కారా కిళ్లీ వల్ల ఎర్రబడ్డ ఆయన పెదవులు విచ్చుకున్నాయి. గార పళ్లమీంచి ఓ నవ్వు అలా తేలి వచ్చి రామారావుని ముసురుకుంది.

"ఎన్నాళ్ల కెన్నాళ్లకి?" అని ఆయన బొంగురు గొంతులోంచి ఆప్యాయత కలబోసుకున్న ఓ వాక్యం మెత్తగా వెలువడింది.

రామారావు నవ్వాడు. అతని పలువరస తెల్లగా మెరిసింది. బిగ్గరగా నవ్వడంచేత వచ్చిన కదలిక వల్ల అతని నల్లని గిరజాల జుట్టు ఎగిరెగిరి పడింది. తెల్లని శరీరం, నల్లని జుట్టు, ఆధునికమైన మీసం, అత్యాధునికమైన దుస్తులు శివరంగం మాస్టార్ని ఆకర్షించాయి. రెండు క్షణాల పాటు రామారావుని చూస్తూండిపోయా డాయన.

"ఎలా ఉందోయ్ ఉద్యోగం?" అన్నారు శివరంగం మాస్టారు.

"బాగుంది, మాస్టారూ! కాని, అమకు ఎప్పుడు సెలవులే దొరకవు" అన్నాడు రామారావు — ఊళ్లో కెప్పుడొచ్చినా శివరంగంగార్ని కలుసుకోకుండా, పలకరించకుండా వెళ్లిపోతున్న తన తప్పుని కప్పుకోవడానికి తగిన పునాది వేసుకుంటూ.

"అదీ నిజమేలే! సరేగాని, ఊళ్లోకి చాలాసార్లొచ్చావుటగా! ఆ మధ్య మీ నాన్న చెప్పాడు" అన్నారు శివరంగంగారు. కనీసం తనని పలకరించనన్నా పలకరించకుండా వెళ్లిపోతూన్న రామారావు నిర్లక్ష్యాన్ని ఆయ నంత తేలిగ్గా క్షమించదలుచుకోలేదు. అందుకే అతను తుంచెయ్యదలచిన విషయాన్ని సాగదీశారు.

"క్షమించండి, మాస్టారూ! ఇంటి కొస్తే చాలు, సవాలక్ష పనులు చెబుతాడు నాన్న. కొత్తగా పెట్ట మాగాణీ అయింది గదండీ? అప్పట్నుంచీ ఆయనకీ తీరుబడి కావడం లేదు. పైగా కాస్త విశ్రాంతికోసం వచ్చిన నన్నూ తిరిగ్గా కూచోనివ్వడు" అన్నాడు నొచ్చుకున్నట్లు కనిపిస్తూ రామారావు.

ఈ రోజుల్లో కుర్రాళ్లు పైకి కనిపించినంత వినయ సంపన్నులు కారని ఏడుస్తాడీ మాజీ మాస్టారు. ముసిలాణ్ణి డిపించడం దేనికి లెమ్మని ఓ చిన్న లెక్చరు దంచి తప్పించుకుంటూంటారనీ శివరంగంగారికి బాగా తెలుసు. అయినా, తన పాత శిష్యుడు రామారావుని క్షమాపణ కోరుకునేట్లు చెయ్యగలిగిన తన తెలివితేటలకి తానే మురిసిపోయి, పళ్లకుంచె మీసా లోసారి సవరించుకుని కీసుక్కున నవ్వేశా రాయన.

"ఇందులో క్షమించటాని కేముందోయ్?" అన్నారు మురిసి ముప్పందుప్పై పోతూ!

'అమ్మ ముసిలాడూ! గడుసుపిండమే! క్షమించమని అడిగించుకున్నాడు చివరికి. పైగా ఉబ్బి తబ్బిబ్బై పోతున్నాడు, జాక్‌పాట్ కొట్టేసట్లు. పోనిద్దూ! ఓ మాటే గదా, ఏం పోయింది' అనుకున్నాడు రామారావు.

"రావోయ్! అలా మా ఇంటికి పోదాం. వాళ్లైతే అప్పుడప్పుడు కలిశామనుకో! మా ఇంటి కొచ్చి ఏళ్లు గడిచాయి గదా?" అన్నారు శివరంగంగారు.

"చిన్న పనుంది, మాస్టారూ! ఓ గంటాగి వస్తాను" అన్నాడు రామారావు.

"తప్పకుండా రావాలి సుమా?" అన్నారు శివరంగంగారు.



-'సంజీవి'

"వస్తాను, మాస్టారూ!" అంటూ రామారావు సెలవు తీసుకుని తిన్నగా రోడ్డుకి తిరిగిపోయాడు. అతను కను మరుగయ్యే దాకా అటే చూసి, ఆ తర

బెంచీలో ఓ మూల ఒదిగి కూచునేవాడు. ఆడపిల్లకన్నా కనాకష్టం. పక్కింటి వెంకట రంగయ్య కూతురు — తుమ్మ మొద్దు—మంగితో కలిసి బడికి రావడం, పోవడం ... ఇవన్నీ ఏమిటి? అదేమంత అవ్సరసని? ఒళ్లు మండిపోయేది తనకి.

ఓసారి ఇదే మాట అడిగిందికూడాను- "రామారావ్! ఆ మంగి నిన్ను కొంగున ముడేసుకుం దేమిటి?" అని చాలా హేళ నగా.

"అది నన్ను కొంగున ముడేసుకోవడ మేమిటి? నేనేం రూపాయి బిళ్లనా?" అని ఎదురు ప్రశ్న వేశాడు రామారావు.

"ఏమోలే!కొంగున కట్టుకుందామనో, నీ చేత మెళ్ళో ముళ్లేయించుకోవటానికో — ఎవరికి తెలుసు? నీ వాలకం చూస్తే ముళ్లేసేలాగే ఉన్నావు" అని ఉడికించింది తను.

"పిచ్చి వాగుడు వాగితే మాస్టారితో చెపుతా" అని బెదిరించాడు రామారావు ఉడుకుబోత్తనంతో. అన్నంత పనీ చేశాడు దుర్మార్గుడు. నాన్న గద్దించి అడిగితే, "అన్నాను, నాన్నా! సరదాగా అన్నాను" అన్నది తను.

"వాడితో సరదా ఏమిటి నీకు? అయినా, మొగాడితో అంత తెగించి మాట్లాడ్డం ఏమిటి? నీ కిదేం రోగ మంట!" అని తండ్రి లెంపలు వాయించాడు కూడాను. కసి... కసి ... కసి ... రామారావు పొగ రెలాగయినా అణిచెయ్యాలి.

ఆనాడు రామారావు మీద కలిగిన కోపం గుర్తొచ్చి కామాక్షి తనలో తనే నవ్వేసుకుంది. ఇప్పుడు—'ఫూర్ ఫెలో' అనుకుంటూ బరువుగా, అదేదో విరహం లాంటి బరువుతో నిట్టూర్పు విడిచింది. మెత్తని పరుపు రాయిలా తగులుతూంది శరీరానికి.

అక్కడ రామారావుకి కోపంతో శరీర మంతా ఉడికి పోతూంది.

'అమ్మా కామాక్షీ! ఎంత గుండెలు దీసిన బంటువే నువ్వు? మంగికీ, తనకీ ముడేస్తూందని శివరంగంగారితో చెప్పి నందుకు తన్నెంత అవమానించేసింది? ఆ రోజు ఉదయం శివరంగం మాస్టారు ప్రైవేటు ముగించి లోపలికి వెళ్లి పోయాక అందరితోపాటు తనూ బయటికి వెళ్లబోయాడు. అందర్నీ వెళ్లనిచ్చి తననిమాత్రం వెనక్కి పిలిచింది కామాక్షి.

"రామారావ్! నా కో చిన్న సహాయం చెయ్యవూ?" అనడిగింది బుంగమూతి పెట్టి. అలా బుంగమూతి పెట్టిన కామాక్షి అంటే తన కెంతో ఇష్టం. అందుకే మురిసిపోతూ, "నువ్వు చెబితే ఏమైనా చేస్తాను" అన్నాడు తను.

"చిన్న ఉత్తరం ఉంది. ఫెయిర్ చేసి పెట్టు" అంది.

అందుకు సిద్ధపడ్డాడు తను. అదేదో కథలో ఉత్తరంలా ఉంది.

"ఎవరు రాశా రిది? ఏదో ప్రేమ లేఖలా ఉంది" అన్నాడు తను సిగ్గు పడిపోతూ.

"రామారావు కామాక్షికి రాశాడు" అన్నది కామాక్షి.

"ఏమిటి? నేను రాశానా? అబద్ధం" అన్నాడు తను కంగారుగా.

"కథలో లేవోయ్! మొన్న మా మామయ్య ఓ కథ ఇక్కడ వదిలేసి వెళ్లాడు. దాన్ని ఫెయిర్ చేసి వీక్లీకి పంపమని రాశాడు. ఈ ఉత్తరం నీ చేత్తో రాయిద్దామని" అన్నది కామాక్షి.

"అంతా నేనే రాసేవాణ్నిగా?" అన్నాడు తను.

"నీ మొహం! నా ఉద్దేశ్యం అర్థమైచావదు నీకు. ఉత్తరం ఒక్కటే నువ్వు రాశావనుకో. అది చూసి ... అది నువ్వు నాకు రాసినట్టే అనుకుంటే ఎలా ఉంటుందో తెలుసుకోవాలని" అన్నది కామాక్షి.

ఎలా అయితే నేం? ఉత్తరం పూర్తి చేశాడు. అందులో ఇలాఉంది: 'ప్రియాతి ప్రియమైన కామాక్షీ! నువ్వంటే నా కిష్టం. నీ పేరు తలుచుకుంటే చాలు, నాకు పిచ్చెక్కుతూంది. నిన్ను ప్రేమిం చాను. నిన్ను తప్ప ఎవర్నీ పెళ్లిచేసుకోను. నీ జవాబుకోసం ఎదురుచూస్తూ, నీ వాడు ... రామారావు.'

కాగితం కామాక్షి కందించి తియ్యని ఊహలతో కొంపకి చేరాడు తను. ఎంత ఘోరం! స్కూలుకి వెళ్లి గంట కాక ముందే హెడ్మాస్టరు మహారుద్రయ్య పిలిచి, ఆ ఉత్తరమే చూపించి, "ఇది నువ్వు రాసిందేనా?" అనడిగారు. తను అవు నన్నాడు. ఏ పరిస్థితుల్లో రాయవలసి వచ్చిందో చెప్పాడు పూసగుచ్చినట్లు. నమ్మితేనా? దానికితోడు కామాక్షి ఆయన కోపాగ్నిలో సమిధలు వేసింది.

"అంతా అబద్ధం, మాస్టారూ! నా దగ్గిర నోట్సు అడిగి తీసుకుని తిరిగి ఇస్తూ అందులో పెట్టి ఇచ్చాడు. కావాలంటే మా విమలని అడగండి. ముందు అదే చూసింది" అన్నది కామాక్షి.

ఆ పచ్చి అబద్ధాలు హెడ్మాస్టరు కొట్టిన దెబ్బలకన్నా ఎక్కువగా బాధ పెట్టాయి తనని.

రామారావు ఉలిక్కిపడ్డాడు ఆలోచిస్తూనే. ఆ క్షణంలోనే ఆలోచనలు ఆగిపోయాయి. అప్పట్లో కామాక్షికి తనమీద ఎంత ద్వేషం ఉండేది— అనుకొని నిట్టూర్చాడు.

ఇక్కడ కామాక్షికి కళ్లు నిండాయి.

చాలా అన్యాయంగా కొట్టించింది తను రామారావుని. అసలే తెల్లగా వెన్న ముద్దలా ముద్దొచ్చే రామారావు బుగ్గలు ఎర్రగా కమిలిపోయి కనిపించేసరికి తనకి ఏడుపొచ్చింది. గదిలో పడుకుని ఏడుస్తున్న తనని సమీపించి, "ఏడుస్తున్నావెందుకమ్మా?" అనడిగారు నాన్న. చెప్ప లేక పోయింది తను. రామారావుని అంత చేటు కొట్టించినందుకు పశ్చాత్తాపంతో ఏడుస్తున్నానని ఎలా చెబుతుంది మరి? చివరికి నాన్నే అర్థంచేసుకుని — "వాడు దెబ్బలు తిన్నందుకేనా? అవునమ్మా! నాతో ముందుగా చెప్పకుండా రుద్రుడి లాంటి హెడ్మాస్టరు కెందు కిచ్చావా కాగితం? నాతో చెబితే నేను వాళ్ల నాన్న చెవినేసి చెవు లెక్కదీయించేవాణ్నిగదా?" అన్నారు కూడా! నిజమే! అలా చేసి ఉంటే చివాట్లతో సరిపోయేదేమో! కాని, జరగవలసింది జరిగిపోయింది. ఇప్పుడేమనుకుని ఏం లాభం?


"లే, అన్నం తిందువుగాని!" అన్నారు నాన్న.

"అవునండీ! దీని కిదేం పోయేకాల మంట! అయినా, ఆడపిల్లకి చదువెందు కంటే మీరు విన్నారూ? దున్నపోతు మీద వాన కురిసినట్లు ఊరుకోవటం తప్ప మరోటి చేతకాదు మీకు. మొద్దు రాచ్చిప్ప అటూ, మీ రిటూను. చోద్యం గాకపోతే, ఆ రౌడీ వెధ వెవడో దెబ్బలు తినడ మేమిటి? ఇది గదిలో పడుకుని ఏడవడ మేమిటి? ఈ చదువులు మన కొంపమీది కేదో తెచ్చి పడేసేలాగే ఉన్నాయి. అంతా నా కర్మ. లే, అమ్మా, లేచి ఇంత నోట్లో కుక్కుకో!" అన్నది అమ్మ.

తన కా రాత్రి నిద్ర పడితేనా? రామా రావు తనతో మాట్లాడతాడో లేదో రేపట్నుంచి! అసలు ప్రైవేటుకైనా వస్తాడో రాడో! అదే బెంగ తనకి. అంతా అయోమయంగా ఉంది.

కామాక్షి ఆలోచన కట్టిపెట్టి భారంగా నిశ్వసించింది. నాటి నుంచి నేటివరకు తన కళ్లకి కనిపించని రామా రావుని తలుచుకుని ఎంతగానో బాధ పడింది కామాక్షి, దిండుని కావలించు కుంటూ.

అక్కడ రామారావు బుగ్గలు నిమురు కున్నాడు ఒకటికి పది సార్లు. అయినా రక్తం ఉడికిపోతూనే ఉంది. అతని బుగ్గ



## ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక

# పరీధావి దీపావళి కథల పోటీ

ప్రతి సంవత్సరంవలెనే ఈ పరీధావి దీపావళి సందర్భంలోనూ ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక కథల పోటీ నిర్వహిస్తూంది.

విరోధికృత్ దీపావళి కథల పోటీలో 5,000 రూపాయల బహుమతులు అందజేశాము. రచయితలకు, రచయిత్రులకు ప్రోత్సాహం కలిగించాలనే సంకల్పంతో ఈ సంవత్సరం కూడా దీపావళి కథల పోటీలో మొత్తం 5,000 రూపాయల బహుమతులు ఇవ్వడానికి నిశ్చయించాము.

రచయితలు, రచయిత్రులు ఈ అవకాశం వినియోగించుకొనవలెననీ, పాఠకులకు ఉత్తమమైన కథలు అందజేయాలనీ, మా కృషి విజయవంతంగా నెరవేరడానికి తోడ్పడాలనీ కోరుతున్నాము.

**మొదటి బహుమతి రు. 2,500**

**రెండవ బహుమతి రు. 1,800**

**మూడవ బహుమతి రు. 700**

### దీపావళి కథల పోటీ నిబంధనలు:

1. ఇతివృత్తం ఆంధ్రుల జీవితానికి సంబంధించినదై ఉండాలి.
2. స్వీయ రచనలేకావి, అనువాదాలు పంపరాదు.
3. రచన ఠరతావు 12×8 అంగుళాలు సైజులో 12 పేజీలకు మించరాదు.
4. సిరాతో కాగితానికి ఒక పక్కనే వ్రాయాలి.
5. బహుమతి పొందని కథలలో యోగ్యమైనవానిని ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రికలో ప్రచురించే హక్కు మాకు ఉన్నది.
6. పోటీకి రచన పంపేటప్పుడు కవరు మీద 'దీపావళి కథల పోటీకి' అని స్పష్టంగా వ్రాయాలి.
7. పోటీకి పంపిన కథలను ఏ సందర్భంలోను తిప్పి పంపించడం జరగదు.
8. ప్రచురణకు ఏ కలం పేరో ఉపయోగించినా తమ అసలు పేరును విధిగా వ్రాయాలి.
9. రచనలను 'ఎడిటర్, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, ఎక్స్‌ప్రెస్ ఎస్టేట్స్, మద్రాసు—2'కు పంపాలి.

బహుమతి పొందిన కథలను ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక దీపావళి ప్రత్యేక సంచికలో ప్రచురించగలము

| | |
|---|---|
| పరీధావి దీపావళి కథల పోటీకి రచనలు మాకు చేరవలసిన ఆఖరి తేది | ఆగస్టు 28, 1972 |

రావు ఒళ్లంతా కళ్లు చేసుకుని కామాక్షిని చూశాడు. ఆమె కూడా అంతే!

"నచ్చానా?" అనడిగింది కామాక్షి.

"సెంట్ పెర్సెంట్! మరి నేనో?" అన్నాడు రామారావు.

"ఫరవాలేదు. నాట్ సో బాడ్!" అన్నది కామాక్షి.

"ఆఁ?" అన్నాడు రామారావు నీరసంగా.

"వివరాలు కావాలంటే తరవాత" అని నవ్విం దామె.

ఇద్దరూ ఎదురుగా ఉన్న కూల్ డ్రింక్ షాపులోకి నడిచారు.

డ్రింకు తాగుతూ షాపు బయట నిలబడి తమవేపే చూస్తున్న తన తండ్రినీ, శివరంగంగార్నీ చూసి గతుక్కుమన్నాడు రామారావు. కామాక్షి భయంతో తల దించుకుంది. బయట నిలబడ్డ వాళ్ల మాటలు లోపలున్న ఇద్దరికీ వినిపిస్తూనే ఉన్నాయి.

"అంతా ఆశ్చర్యంగా ఉందే!" అన్నారు శివరంగంగారు.

"సినిమాలకి వెంట తిప్పుకోవడానికి ఇష్టం ఉందిగాని...వెధవకి... పెళ్లంటే ఏమి టలా చచ్చు కబుర్లు చెబుతాడు?" అన్నారు సీతారామయ్య.

రామారావు, కామాక్షి భయం భయంగా బయటికి వచ్చారు.

"ఏరా! ఇదేమన్నా బాగుందా? లోకు లేమనుకుంటారు?" అన్నారు కోపంగా సీతారామయ్య.

"అనుకోకుండా హాల్లో కలిశాం, నాన్నా!" అన్నాడు రామారావు.

"ఏం, తల్లీ! సినిమా చూడ్డాని కొచ్చావా? పాత స్నేహితుడితో కూల్ డ్రింకులు తాగుదామని వచ్చావా? ఆ ఘటం ఏదీ? సినిమాకొస్తే దానికి ఒళ్లు తెలీదు" అన్నారు శివరంగంగారు.

"పోనీలేవయ్యా, శివరంగం! చూపుల బెడద తప్పించారు. అంతా దైవఘటన! నా కోరిక తీరింది. ఒరే, సన్నాసీ! వెళ్లు లోపలికి. వెళ్లమ్మా, కామాక్షీ! జాగ్రత్త. మావా డంత మంచి వాడు కాదు. ఒరేయ్, సినిమా అయ్యాక వాళ్లని ఇంటి దగ్గిర దిగబెట్టి తిన్నగా ఇంటికి రా" అన్నారు సీతారామయ్య.

రామారావు, కామాక్షి హాలువైపు కదిలారు. గేటుముందు నిలబడ్డ ఇద్దరూ ఒకర్నొకరు చూసుకుని గట్టిగా నవ్వేసుకున్నారు.

బయట కూల్ డ్రింకు షాపు ముందు నిలబడి ఉన్న శివరంగంగారు, సీతారామయ్య పగలబడి నవ్వుకుంటూనే ఉన్నారు. *